

ఇష్టారాజ్యం.. అడిగేవారెవరు.!

- ఆఫీస్‌ను తెరవరు.. ఫోన్‌కు స్పందించరు
- గాఢనిద్రలో లీగల్ మెట్రాలజీ అధికారులు
- యథేచ్ఛగా తూకాల్లో మోసాలు
- అధికారుల తీరుపై విస్తుబోతున్న ప్రజలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: వినియోగదార్లకు హక్కుల కాపాడేందుకు వినియోగదారులు హక్కు చట్టం ఉంది. ఈ చట్టం ప్రకారం వినియోగదారులకు జరిగే మోసాలను అరికట్టేందుకు లీగల్ మెట్రాలజీశాఖ (తూనికలు, కొలతల శాఖ) కల్తీ నివారణ శాఖలతో పాటు మెడికల్‌షాపుల్లో నాణ్యత లేని మందుల విక్రయాలను అరికట్టేందుకు డ్రగ్ కంట్రోల్ శాఖపై జిల్లా స్థాయిలో ఇన్స్పెక్టర్లలుంటారు. వీరి క్రింద క్షేత్రస్థాయిలో పని చేసేందుకు సిబ్బంది ఉంటారు.

జిల్లాలోని వినియోగదారుల హక్కుల కాపాడాల్సిన బాధ్యత ఈ శాఖలపై ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి తూకాల్లో మోసాలు, ఆహారకల్తీని నిరోధించడం, మెడికల్‌షాపుల్లో మందుల ధరలు, కల్తీ మందుల అమ్మకాలపై నిఘా ఉంచాలి. వినియోగదారులు ఇచ్చే ఫిర్యాదులపై దాడులు చేయడంతో పాటు ఆయా శాఖలు దాడులు చేసి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు అపరాధ రుసుములు విధించాలి. అయితే వినియోగదార్ల హక్కులు కాపాడాల్సిన శాఖలు ఘాడ నిద్రల్లో ఉండటంతో కల్తీలు, మోసాలు చేసేవారు ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నారు. ఫిర్యాదులు చేస్తున్న పట్టించుకోవడం లేదంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మూతవేసి ఉన్న కార్యాలయం



జిల్లా కేంద్రంలోని లీగల్ మెట్రాలజీశాఖ కార్యాలయం

మూసిన తలుపులు మూసినట్లే

తూకాల్లో మోసాలను అరికట్టాల్సిన తూనికల కొలతశాఖ కార్యాలయం జిల్లా కేంద్రమైన చిత్తూరు లిటిల్‌ఫ్లవర్ స్కూల్ ఎదురుగా ఉంది. ఈ కార్యలయం ఎప్పుడు చూసిన మూతవేసే ఉంటుంది. ఇక్కడి పని చేసే సిబ్బంది ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళతారో తెలియని పరిస్థితి. తూనికల కొలతల శాఖ (లీగల్ మెట్రాలజీ) ఘాడనిద్రలో ఉటోందనే చెప్పక తప్పదు. ఈ శాఖలో పని చేసే ఇన్‌స్పెక్టర్ దివ్య తన సీటులో కనిపించడం మానేశారు. దీంతో ఇతర సిబ్బంది కూడా కార్యాలయానికి రావడం మానేశారు. క్రింది స్థాయి సిబ్బంది వారి తోచిన సమయంలో చిత్తూరు నగరంలో తనిఖీల పేరిట అందినంతా దోచేస్తున్నారు. ఇలా దుకాణాలు, తోపుడు బండ్ల వ్యాపారుల నుంచి వసూలు చేస్తున్న దాంటో పై అధికారులు వాటాలు పంచుకుంటూ వినియోగదార్లను నట్టేట ముంచేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

అడిగేవారు లేరనే ధీమా..

అడిగేవారు లేరనే ధీమాతో తూనికల కొలతశాఖ అధికారులు తీరు అత్యంత దయనీయంగా ఉంది. ఫోన్ చేసి విషయం తెలుసుకుందామన్నా లిఫ్ట చేయరు. ముఖ్యంగా కూరగాలయ మార్కెట్, చేపల మార్కెట్, ప్రధాన వాణిజ్య కేంద్రాల్లో ఇలాంటి ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వ చౌక దుకాణాల్లో ఎలక్ట్రానిక్ యంత్రాల్లో అర కిలో తేడా వస్తోంది, చక్కెర, కందిపప్పులో 50గ్రాములు తగ్గుతోందని బియ్యం కార్డుదార్లు చెబుతున్నారు. మెలుకో.. మెలుకో వినియోగదారుడా అంటూ వినియోగదార్ల చట్టం పదేపదే వినియోగదారులను నిద్రలేపుతున్నా ఈ శాఖల పనితీరులో మార్పు రాకుంటే వినియోగదారులు ఎలా మెలుకుంటరో అర్థం కావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

భక్తుల సేవకు సమిష్టి కృషి

టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు బాధ్యతలు స్వీకరణ



ప్రజాశక్తి - తిరుమల ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హిందూ పుణ్యక్షేత్రమైన తిరుమల పవిత్రతను కాపాడుకోవడమే ప్రస్తుత టీటీడీ ధర్మకర్తల మండలి ప్రాధాన్యత అని టీటీడీ నూతన ధర్మకర్తల మండలి ఛైర్మన్ బి.ఆర్. నాయుడు తెలియజేశారు. భక్తుల సేవకు సమిష్టి కృషి అవసరం అన్నారు. ప్రమాణస్వీకారం అనంతరం బుధవారం సాయంత్రం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఆయన తొలిసారిగా మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీవారి భక్తులకు సేవ చేసుకునే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. తాను చిన్నప్పటి నుండే ప్రతి సంవత్సరం శ్రీవేంకటేశ్వర స్వామిని కాలినడకన వచ్చి దర్శించుకునేవాడినని, ప్రస్తుతం తిరుమలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు సేవ చేసుకునే అరుదైన అవకాశాన్ని శ్రీవారు ప్రసాదించడం పూర్వజన్మ సుకతమన్నారు. భక్తులకు సేవ చేసేందుకు మీడియాతో సహా ప్రతి ఒక్కరూ తోడ్పాటు నందించాలని కోరారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గత నెలలో బ్రహ్మోత్సవాలను ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా విజయ వంతంగా నిర్వహించిన అధికారులకు అభినందనలు తెలిపారు. తిరుమల పవిత్రతను కాపాడేందుకు, భక్తులకు సౌకర్యవం తమైన దర్శనం కల్పించేందుకు అధికారులు సమిష్టి కృషిని కొన సాగించాలని ఆకాంక్షించారు. అంతకుముందు టీటీడీ సీనియర్ అధికారుల ఒదరితో ఛైర్మన్ పరిచయ సమావేశం నిర్వహిం చారు. టీటీడీ ఈవో జె.శ్యామలరావు టీటీడీ నిర్వ హిస్తున్న వివిధ కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ సమర్పించారు. టీటీడీ అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్ర హ్మం, సీవీఎస్వో శ్రీధర్, డిఎల్ఓ వరప్రసాదరావు, సిఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి


వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లా ప్రధాన ఆసుపత్రికి వచ్చే పేషంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా ప్రధాన ఆసుపత్రిలో పేషంట్లకు అందించే సేవలపై ఆసుపత్రి సూపరింటెండెంట్, డిసిహెచ్ఎస్, అపోలో యాజమాన్య ప్రతినిధులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రధాన ఆసుపత్రిలో వివిధ విభాగాల ద్వారా పేషంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. ఇందుకు సంబంధిత అధికారులందరూ సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవల ద్వారా అందించే వైద్య సేవలను విస్తృతం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రిలో అవసరమైన పరీక్షల నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించుకొనేందుకు కృషి చేయాలని, తద్వారా పేద ప్రజలకు ఆరోగ్య భరోసాను కల్పించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఆ దిశగా పనిచేయాలని ఆదేశించారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి, డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్యసేవా జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్ కుమార్, అపోలో యూనిట్ ఇన్‌ఛార్జ్ నరేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అధ్యక్ష పదవికి డాక్టర్ సుధీర్ రాజీనామా

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ హాజరయ్యారు. ఈ సమావేశంలో పురపాలక సంఘం అధ్యక్షుల రాజీనామాను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంతకాలం తనకు సహకరించిన కౌన్సిలర్లకు, పురపాలక సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కుప్పం అభివృద్ధికి టీడీపీతో కలిసి క్రియాశీలకంగా పనిచేస్తానని తెలిపారు.



కౌన్సిల్ సమావేశంలో ప్రసంగిస్తున్న డాక్టర్ సుధీర్

అనంతరం కౌన్సిలర్లు డాక్టర్ సుధీర్‌ను ఘనంగా సన్మానించారు. సుధీర్ రాజీనామాతో 16వ వార్డుకు త్వరలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.

టెర్రకోట పరిశీలన

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు పురపాలక సంఘం పరిధిలోని సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను బుధవారం జెసీ విద్యాధరి పరిశీలించారు. అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అంతకు ముందు పట్టణంలోని టెర్రాకోటను వీక్షించి అక్కడ తయారు చేసిన బొమ్మలను పరిశీలించారు. టెర్రకట బొమ్మలకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చే విధంగా ప్రయత్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలమనేరు రెవిన్యూ డివిజినల్ ఆఫీసర్ భవాని, మండల రెవెన్యూ ఆఫీసర్ ఇన్బనాథన్, మునిసిపల్ కమిషనర్ ఎన్‌వీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహంలో తనిఖీ

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని బాలికల వసతి గృహం, సివిల్ సప్లై గోడౌన్‌ను జెసీ విద్యాధరి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. బాలికల కోసం నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్ల కేంద్రాలను త్వరతగతిగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులను చెల్లించి పూర్తి చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ డిడి రాజ్యలక్ష్మిని ఆదేశించారు. బాలికలకు పౌష్టికాహారం అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అనంతరం ప్రభుత్వం అందించే నిత్యవసర సరుకుల కేంద్రాన్ని పరిశీలించి రేషన్ కార్డు పంపిణీ చేసే సరుల్లో నాణ్యతను నిల్వ ఉన్న వస్తువులను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, గోడౌన్ డిటి రమేష్, వార్డెన్ గీత తదితరులు పాల్గొన్నారు.


బంగారుపాళ్యంలో

నేడు విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభించనున్న సీఎం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: వి కోట నూతనంగా ఏర్పాటైన 132/33 కె.వి. విద్యుత్ ఉప కేంద్రాన్ని గురువారం సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు బుధవారం కలెక్టర్ సుమిత కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఏపి ట్రాన్స్ కో ద్వారా నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్ రావు, పలమనేరు ఎమ్మెల్యే ఎన్ అమరనాథ రెడ్డి, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

- డీపీవో పార్వతి


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డీపీవోం

ప్రజాశక్తి-పూతలపట్టు: పారిశుధ్యంపై ప్రతినిత్యం దృష్టి సారించాలని డీపీవో పార్వతి పంచాయతీ అధికారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు విస్తారం గా కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్న ప్రమాదముంది. పారిశుధ్యం లోపం కారణంగా దోమలు విస్తరించే ప్రమాద ముందన్నారు. పారిశుధ్యంతో పాటు దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎంపీ


శ్రీవారి సేవల్లో ఎంపి దగ్గుమళ్ళ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు బుధవారం దర్శించుకున్నారు. టీటీడీ ఛైర్మన్ బాధ్యతలు స్వీకరించిన బిఆర్ నాయుడకి శు భాకాంక్షలు తెలిపారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనాలు పలికి శ్రీవారి తీర్థప్రసాదాలను అందించారు. ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ టిటిడి సమర్థవంతంగా పనిచేయడం వల్లే శ్రీవారి భక్తులకు నాణ్యమైన సేవలు అందుతున్నాయని అన్నారు.

ఏపీవోగా శ్రీనివాస్ యాదవ్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-గంగవరం: గంగవరం మండల ఉపాధి హామీ పథకం ఏపీవోగా శ్రీనివాస్ యాదవ్ బుధవారం బాధితులు స్వీకరించారు. గతంలో పనిచేస్తున్న మురుగేషన్ పెద్దపంజాణి మండలానికి బదిలీ అయ్యారు. కాగా గంగవరం మండలానికి శ్రీనివాస్ యాదవ్ నియమితులైయ్యారు.

నాణ్యతే ప్రామాణికం

- సీసీ రోడ్డు నిర్మాణం వేగవంతం చేయాలి
- తప్పనిసరిగా క్వాలిటీ పరీక్షించండి
- అసంపూర్తి అంగన్వాడీ భవనాలను పూర్తి చేయాలి
- అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ దిశానిర్దేశం


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నాణ్యతే ప్రామాణికంగా తీసుకొని గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. 2024-25ఏడాదిలో చేపడుతున్న అభివృద్ధి పనులు, వాటి పురోగతిపై చర్చించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ రవికుమార్, పీఆర్ డీఈలు, ఏఈలు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా అంతర్గత సిమెంట్ కాంక్రీట్ రోడ్డకు సంబంధించి 2024-25 సంవత్సరానికి గానూ 1503పనులు మంజూరైనట్లు తెలిపారు. ఇందులో రూ.13కోట్లతో 248పనులు పూర్తి చేశామని, రూ.8కోట్లకు సంబంధించి బిల్లులు అప్‌లోడ్ చేసి రూ.2.50కోట్లు చెల్లింపు జరిగినట్లు వివరించారు. పూర్తి చేసిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను సత్వరం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సిసి రోడ్డు నిర్మాణ సమయంలో పంచాయతీరాజ్ ఇంజనీర్లు నాణ్యతను పరీక్షిస్తుండాలని, నాణ్యతాపరంగా ఖచ్చితంగా ఉండాలన్నారు. ఎంజిఎన్‌ఆర్ఈజిఎస్ ద్వారా చేపట్టే ఇతర పనులను విస్తృత ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదనలు పంపాలన్నారు. ఐసిడిఎస్ అధికారులతో సమన్వయం చేసుకుని అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవనాల నిర్మాణాలను పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. సిసి రోడ్ల నిర్మాణంలో వెనుకబడిన మండలాల్లో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.


సిసి రోడ్డు నిర్మాణ పనులు ఇలా..

చిత్తూరు నియోజకవర్గంలో రూ.21లక్షలతో 6పనులు పూర్తి, జిడి నెల్లూరు నియోజకవర్గంలో రూ.2.50కోట్లతో 54పనులు, పలమనేరు నియోజకవర్గంలో రూ.2.88కోట్లతో 62పనులు, పూతలపట్టు నియోజకవర్గంలో రూ.కోటితో 27 పనులు, కుప్పం నియోజకవర్గంలో రూ.4.20కోట్లతో 62 పనులు, నగరి నియోజకవర్గంలో ఒక కోటి రూపాయలతో 9 పనులు, పుంగనూరు నియోజకవర్గంలో రూ.91.50లక్షలతో 28పనులు. మొత్తం రూ.12.89కోట్లతో 248 పనులు పూర్తి చేసినట్లు తెలిపారు.

యాదమరి టీచర్‌లకు యుటిఎఫ్ జిల్లా కార్యవర్గంలో చోటు

ప్రజాశక్తి-యాదమరి: మండల ఉపాధ్యాయులుకు చిత్తూరు జిల్లా యుటిఎఫ్ కార్యవర్గంలో చోటు దక్కింది. యుటిఎఫ్ చిత్తూరు జిల్లా స్వర్ణోత్సవ సంబరాలు, 17వ జిల్లా మహాసభలు సందర్భంగా నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గంలో యాదమరి మండలం నుంచి చిత్తూరు జిల్లా సహాధ్యక్షురాలుగా ఎస్ రెహానా బేగం, జిల్లా కార్యదర్శిగా పంటపల్లి సురేష్ ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటాన్ని చేస్తామని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ముందుంటామని తెలిపారు.





బ్యాడ్మింటన్‌లో మెరిసిన బృందావన్ విద్యార్థి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఎస్‌జిఎఫ్ఐ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలు ప్రొద్దుటూరు జూర్జ్ కొరనేషన్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. అండర్ 19 విభాగంలో చిత్తూరు బృందావన్ స్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థి టి ప్రణవ్‌సాయి వెండిపథకం సాధించిన్నట్లు బృందావన్ స్కూల్ కరెస్పాండెంట్ శైలజకుమరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికయ్యారని తెలిపారు. క్రీడారులను ప్రోత్సహిస్తూ బృందావన్ స్కూల్ కరెస్పాండెంట్ శైలజకుమారి, డైరెక్టర్ ప్రియతేజ ప్రణవ్‌సాయిని అభినందించారు.



ప్రణవ్‌సాయిని అభినందిస్తున్న కరెస్పాండెంట్

కొండ చిలువ.. హల్ చల్



ప్రజాశక్తి-గుడిపాల: కొండచిలువ హల్‌చల్ చేసిన ఘటన గుడిపాల మండలంలోని పిళ్ళారికుప్పం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఉపాధి హామీ పనులు నిమిత్తం పిళ్ళారికుప్పంలో కూలీలు పనులు చేస్తుండగా సుమారు 10అడుగుల పొడవు గల కొండచిలువ పని ప్రాంతంలోకి వచ్చి హల్‌చల్ చేసింది. స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారాన్ని అందించారు. స్నేక్ క్యాచర్ ప్రేమ్ సహాయంతో ఘటనా స్థలానికి చేరుకొని గంటపాటు శ్రమించి కొండచిలువను పట్టు కోవడంతో పీల్చుకున్నారు. అనంతరం సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

మోకాళ్లు పట పట.. కీళ్లలో కరకర

- 30ఏళ్లకే వేధిస్తున్న కీళ్ల నొప్పులు
- ఉమ్మడి జిల్లాలో 35శాతం మహిళలు సతమతం

ప్రస్తుత జీవన విధానంలో వచ్చిన మార్పులతో వయసుతో సంబంధం లేకుండా కీళ్ల నొప్పులు ప్రభావం చూపుతున్నాయి. మహిళల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. కుటుంబ సంరక్షణలో భాగంగా మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం లేదు. దీంతో కూర్చోవడం నడవడం నిలబడడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరోగ్యకర ఆహార అలవాట్ల లేమితో ఎముకల్లో గట్టిదనం తగ్గి కీళ్లు బలహీనంగా మారుతున్నాయి. దీంతో 30ఏళ్ళ వయసులోనే సమస్య కనిపిస్తోంది. మగవారిలోనూ వారి యొక్క వృత్తిని బట్టి ఈ సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుంది.



ప్రజాశక్తి-పూతలపట్టు: ప్రస్తుత ఆహారపు విధానంలో వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరిని మోకళ్ళు కీళ్ల నొప్పులు వేధిస్తున్నాయి. 30ఏళ్లకే నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరైతే ఏకంగా మంచానికే పరిమితం కావలసి వస్తుంది. యుక్త వయసులో ఉన్నవారు సైతం నరాలు పట్టుకుపోవడం వంటి వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో నిద్రపోతున్నప్పుడు కండరాలు పట్టుకుపోవడం వంటి సమస్యలు అత్యధికంగా కనిపిస్తున్నాయి.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో 35శాతం మంది

మోకాళ్ళ నొప్పులు, కండరాలు, కీళ్ల నొప్పులకు సంబంధించిన రోగులే కనిపించడం ఇందుకు ఉదాహరణ. ఆర్థికంగా ఉన్నవారు రూ.2లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు ఖర్చుపెట్టి మోకాళ్ళకు శస్త్ర చికిత్సలు చేయించుకుంటున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న వారు నొప్పులతో సతమతమవుతున్నారు.

29.16మందిలో పోషక ఆహార లోపం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని గృహిణిలు, ఉద్యోగులు, విద్యార్థులు 29.16శాతం ఆహార లోపంతో బాధపడుతున్నారని సర్వేలు చెబుతున్నాయి. దీనికి తోడు వ్యాయామం లేకపోవడం విటమిన్ డి3 తక్కువగా ఉండడం వంటివి వెన్ను మోకాళ్ల నొప్పులకు కారణమవుతున్నాయి. ఏడు వయసు నుంచి 30 ఏళ్ల వయసు వరకు అధిక బరువు వేధిస్తోంది. కీళ్ల నొప్పులు మోకాళ్ళ అరుగుదలకు ఇది ఒక కారణంగా చెప్పుకోవచ్చు.

నొప్పులతో సతమతం..

30 నుంచి 60 ఏళ్ల మధ్య మహిళలు ఎక్కువగా ఎముకలు కీళ్లకు సంబంధించిన సమస్యలకు గురవుతున్నారు. పురుషులు సైతం 35ఏళ్ళు పై పడగానే మోకాళ్ళ నొప్పులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఎక్కువసేపు నిల్చొని ఉండడం మటం వేసుకుని కూర్చోవడం, కాల్షియం ఉన్న ఆహారం సరిగా తీసుకోకపోవడం ఇబ్బంది అవుతుంది. పాలు, గ్రుడ్డు వంటివి తీసుకోవడం వలన కొంతమేర ఉపయోగకరంగా ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి..

చాలా వరకు గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆరోగ్యంపై దృష్టి సారించడం లేదు. ప్రోటీన్ ఫుడ్ తీసుకోవడం వలన మోకాళ్ళ నొప్పులను కొంతవరకు అరికట్టవచ్చు. అతిగా వాకింగ్ చేయడం ప్రమాదకరం. షుగర్ వ్యాధిగ్రస్తుల్లో కాల్షియం తగ్గడం వలన వీటి బారిన పడుతుంటారు. మహిళలు కుటుంబ నియంత్రణ శాస్త్ర చికిత్సలు చేసుకున్నప్పుడు కాల్షియం తగ్గడం వలన అధికంగా మోకాళ్ల నొప్పులు వస్తుంటాయి. సరైన ఆహారం, వ్యాయామంతో మోకాళ్ళ నొప్పులను తగ్గించుకోవచ్చు.

- ప్రియాంక, వైద్యాధికారిని, పూతలపట్టు

8న మండల మీట్

ప్రజాశక్తి-గుడిపాల: ఈనెల 8వ తేదీన ఉదయం 11గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని గుడిపాల ఎంపీడీవో శివరాజ్ తెలిపారు. ఈ సమావేశానికి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ హాజరవుతారన్నారు. సంబంధిత శాఖాధికారులు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని అలాగే ఆ శాఖల సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు సంబంధించి వివరాలను ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

సోమలలో..

సోమల: సోమల మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 8వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో నారాయణ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశపు మందిరంలో సమావేశం ఉంటుందన్నారు. హాజరయ్యే మండల స్థాయి అన్ని శాఖల అధికారులు ముందస్తుగా సమావేశానికి తమ ప్రగతి నివేదికలకు సంబంధించి వివరాల 10సెట్ల జిరాక్స్ కాపీలు అందజేయాలన్నారు. సమయపాలన పాటిస్తూ అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు. అదేవిధంగా అందరూ ప్రజా ప్రతినిధులు, కోఆప్షన్ మెంబర్లు, సమావేశానికి హాజరుకావాలని కోరారు.

జోరుగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లి పంచాయతిలో ఈవోఆర్‌డీ పురుషోత్తం ఆదేశాలతో పారిశుధ్య పనులు ఊపందుకున్నాయి. సర్పంచ్ ఎం భారతి చిన్నస్వామి, పంచాయతీ కార్యదర్శి ఎమ్ మనోహర్ ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. జేసీబీతో రోడ్డుకి ఇరువైపులా పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు తొలగించారు. గ్రామాలలో పారిశుధ్య పనులు మెరుగు పరచడమే లక్ష్యమని సర్పంచ్ మీడియాకు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, స్థానికులు ఉన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆర్‌ఎల్ జల్లప్పా హాస్పిటల్ సహకారంతో శిబిరాన్ని ఏర్పాటు చేయగా కంటి సమస్యలతో బాధపడుతున్న 43మంది పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ హర్షిత కంటి పరీక్షలు నిర్వహించి 9మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కాంతమ్మ, శ్రీదేవి అయూబ్, రాజారెడ్డి పాల్గొన్నారు.ం

అనాధ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న రైల్వే పోలీసులు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: తమిళనాడు సరిహద్దు ప్రాంతం కుప్పం మండలం పులిగుండు ప్రాంతంలో అక్టోబర్ 30వ తేదీ రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మరణించిన సంగతి తెలిసిందే. మృతుడు బీహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా రైల్వే పోలీసులు గుర్తించి, బంధువుల రాక కోసం ఎదురుచూస్తూ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచారు. అయినా వారి బంధువులు రాకపోవడంతో డీకే పల్లి మణి సహకారంతో రైల్వే పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు.

సీఎంకు చెక్కు అందజేత



సీఎంకు చెక్కు అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రామకుప్పం: సీఎం చంద్రబాబుకు రామకుప్పం టిడిపి నేతలు వరద బాధితుల సాయం కోసం విరాళంగా చెక్కును అందించారు. మంగళగిరిలోని సీఎం నివాసంలో టిడిపి నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల విజయవాడలో తుఫాన్ కారణంగా వరద బాధితుల సహాయం కోసం మండలంలో సేకరించిన విరాళాలు 17,17,175 రూపాయల చెక్కును సీఎంకు అందించారు. కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్‌టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మణిరత్నం, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర నేతలు సురేష్ బాబు, మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్షులు ఆనంద రెడ్డి, కార్యదర్శి నరసింహులు, నేతలు ఆంజనేయ రెడ్డి, కృష్ణ నాయక్, రామ్మూర్తి, చలపతి, నందా రెడ్డి, సలాం సాబ్, జయశంకర్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ చెన్నపట్నం చెరువు వద్ద గురువారం, శుక్రవారం అభయ ఆంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అలివేలమ్మ సుబ్రహ్మణ్యం దంపతులు తెలిపారు. గురువారం గణపతి పూజ, పుణ్యాహవచనం, గంగపూజ, అంకురార్పణ, రక్షాబంధన్, వాస్తు హోమం, మహ మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం, శుక్రవారం ప్రాణ ప్రతిష్ట, నవగ్రహ పూజ, తీర్థ ప్రసాద వినియోగం ఉంటాయని, హనుమాన్ చాలీసా, అయ్యప్ప పడి పట్ల పూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు

జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-వి కోట: మండలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ యువరాజు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహించిన మొట్టమొదటి సమావేశం కావడంతో సభ్యులు, అధికారులు సమావేశంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సంవత్సరం మండలంలో గణనీయంగా వేరుశనగ సాగు విస్తీర్ణం తగ్గిందని దానికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం సబ్సిడీపై ఉలవలు పంపిణీ చేయగా రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేశారని వ్యవసాయ శాఖ అధికారిని రాజ్యలక్ష్మి సభ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వ అందిస్తున్న రాయితీలను సంబంధిత అధికారి సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందించే సబ్సిడి విత్తనాలు, వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. వీటిపై ప్రజాప్రతినిధులు అధికారులు రైతులకు అవగాహన కల్పిం చాలన్నారు. మండలంలోని 18 పంచాయతీలలో తాగునీటి సమస్యలు తలెత్తే ప్రాంతాలను గుర్తించి మండల పరిషత్ ఆమోదంతో జిల్లా పరిషత్‌కు పంపితే నిధులు విడుదల చేస్తామని వారు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, దీనితో 18పంచా యతీలలో ప్రజలకు సేవలు అందించేందుకు ఇబ్బందిగా ఉందని వైద్యాధికారి సభ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి సిబ్బందిని నియమించాలని సభలో చర్చించారు. అదేవిధంగా పశు వైద్యాధికారుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. వైద్యులు, సిబ్బంది కొరతతో మండలంలో ఇటీవల అధిక సంఖ్యలో పశువులు మృత్యువాత పడ్డాయని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలులో నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని దీని కనుగు ణంగా చర్యలు తీసుకోవాలని సభ్యులు విద్యాశాఖ అధికారికి సూచించారు. గత ప్రభుత్వంలో మూతపడిన పాఠశాలలకు కూడా ఇప్పటికీ విద్యుత్ బిల్లులు వస్తున్నాయని వీటిని నిలుపుదల చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఎంఈవో చంద్రశేఖర్ సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎనర్జీస్ నిధులతో మండలంలో 47రోడ్లు మంజూరయ్యాయని, వివిధ దశల్లో పనులు జరుగుతున్నాయని పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసులు సభ్యులకు తెలిపారు. మండలంలో శ్మశానాలు, వ్యవసాయ పొలాలకు వెళ్లే దారులను అడ్డగించే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని సభ్యులు తహశీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. మండల పరిషత్ ఆమోదంతో పనుల నివేదికలు డ్వామాకు పంపి అనుమతులు వచ్చిన వెంటనే నూతనంగా ఉపాధి పనులు చేపడతామని ఏపీఓ అశోక్ రెడ్డి సభ్యులకు వివరించారు. వీటితోపాటు అటవీ సరిహద్దుల్లో ఏనుగుల దాడులను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సంబంధిత అధికారులు సభ్యులకు తెలిపారు. వీటితోపాటు పలు శాఖలలో ప్రభుత్వ పరంగా చేపట్టి అమలు చేస్తున్న వివిధ పనుల వివరాలను సమావేశంలో చర్చించారు. చివరగా ఎంపీపీ యువరాజ్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అభివృద్ధి చేసేందుకు అందరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ రెడ్డి, తమీంఖాన్, జిల్లా పరిషత్ సలహా మండలి సభ్యులు గౌస్, తహశీల్దార్ పార్వతితో పాటు సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్యకర్త పాడె మోసిన ఎమ్మెల్యే



ప్రజాశక్తి-యాదమరి: మండలంలోని కాశిరాళ్ళ గ్రామానికి చెందిన టిటిడి కార్యకర్త మునిరత్నం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ బుధవారం మధ్యాహ్నం కాశిరాళ్ళ గ్రామానికి చేరుకుని టిడిపి కార్యకర్త మునిరత్నం మృతిదేహాన్ని పూలమాల వేసి నివాళులర్పించి భాధిత కటుంబాన్ని పరామర్శించారు. అనంతరం టిడిపి కార్యకర్త మునిరత్నం మృతిదేహంపై టీడీపీ జెండా కప్పి అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. భాధిత కుటుంబ సభ్యులకు ఈ తీవ్ర విషాదాన్ని తట్టుకునే శక్తి భగవంతుడు ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు. మునిరత్నం పార్టీకి చేసిన చేసిన సేవలు మరిచి పోలేనివని గుర్తు చేసుకున్న ఆయన, భాధిత కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో యాదమరి మండల పార్టీ అధ్యక్షులు మురార్జీ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్, రబ్బీ, మండల నాయకులు, కార్తకర్తలు పాల్గొన్నారు.

రైతులు శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి



రైతులకు సూచనలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-సోమల: రైతులు శాస్త్రవేత్తల సలహాలు పాటించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల మామిడి రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. మామిడిలో పూత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు చాలా విపులంగా శాస్త్రవేత్త బాలహుస్సేన్ తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారిని సంతోషి కుమారి, ఎంపీఈవోలు, రైతులు పాల్గొన్నారు.

13న బహిరంగ వేలం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం:


మండలంలోని మొగిలేశ్వర స్వామి ఆలయ భూములను మూడు సంవత్సరాలకు కౌలుకు ఇవ్వడానికి ఈ నెల 13న వేలం పాట నిర్వహించనున్నట్లు ఈవో మునిరాజులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి సంబంధించి గొల్లపల్లి, టేకుమంద, ఊటు వంక ప్రాంతాల్లో సుమారు 44 ఎకరాల భూమి ఉన్నట్లు పేర్కొన్నారు. ఆ భూములను మూడు సంవత్సరాల లీజుకు ఇవ్వడానికి వేలంపాట నిర్వహిస్తామని వివరించారు. వేలంపాట దారులు పూర్తి వివరాలకు 944176 1536 నెంబర్‌ను సంప్రదించాలని ఈవో కోరారు.

టిటిడి పాలక మండలి సభ్యులకు సత్కారం



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: టిటిడి పాలక మండలి సభ్యులు మల్లెల రాజశేఖర్ గౌడ్‌ని బుధవారం గౌడ సంఘ కులస్తులు సత్కరించి అభినందనలు తెలిపారు. బుధవారం టిటిడి దేవస్థానం వద్ద ప్రమాణస్వీకారం చేసిన కర్నూలు జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ మల్లెల రాజశేఖర్ గౌడ్‌ను తిరుమల కావేరి భవన్‌లో కలిసి దుశ్శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి చిత్తూరు పార్లమెంటు ఈడిగ బిసి సాధికార సమితి అధ్యక్షులు బుసా నాగరాజ గౌడ్ మాట్లాడుతూ కూటమిప్రభుత్వంలో గౌరవముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు గౌడ కులస్థులుకు రెండు మంత్రిపదవులు, ఆర్టీసి చైర్మన్ పదవి, టిటిడి పాలక మండలిలో ప్రాధాన్యత కల్పించారన్నారు. మద్యం షాపులలో10శాతం రిజ ర్వేషన్ కల్పించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు ఈడిగ బిసి సాధికార సమితి అధ్యక్షులు తోయజాక్షులుగౌడ్, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఈడిగ గౌడ్ సంఘం ఉపాధ్యక్షుడు కోణంగి శివకుమార్, చిత్తూరు జిల్లా ఈడిగ బిసి సాధికార సమితి సభ్యులు కొత్తపల్లి రెడ్డప్ప గౌడ్, నాయకులు మురళిగౌడ్, వేణు గౌడ్, క్రిష్ణగౌడ్, యార్లపల్లి ఉదయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ



ప్రజాశక్తి-యాదమరి:

మాతా శిశు మరణాలను పూర్తిగా నిర్మూలించే నిమిత్తం చేపట్టిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం దేశవ్యాప్తంగా ప్రతి బుధవారం, శనివారం రోజుల్లో జరుగుతుంది. ఈ కార్యక్రమం అమలు ఎలా జరుగుతున్నదన్న దాన్ని పరిశీలించేందుకు చిత్తూరు జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి డాక్టర్ హనుమంతరావు బుధవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని యాదమరి ఉప ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉప ఆరోగ్య కేంద్రంలో టీకాలు వేయించుకునే చిన్నారులతో వచ్చిన బాలింతలను, వివిధ పరీక్షల కోసం వచ్చిన గర్భవతులను వారు వేసుకున్న టీకాలు గురించి అడిగి తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ టీకాల కోసం వచ్చే సమయంలో వారి వెంట తప్పనిసరిగా యాంటినేటల్ కార్డు తీసుకురావాలని అలాగే ఏ ఏ సూది మందు ఎందుకు ఇప్పించుకుంటున్నారు అన్న విషయాలను కూడా తెలుసుకోవాలని సూచించారు. సిబ్బంది 100 శాతం వ్యాధి నిరోధక టీకాలను చిన్నారులకు అందించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ హనుమంతరావు సూచించారు.

తొలగిన తీగలు


- ప్రజాశక్తి వార్తకు స్పందన



ట్రాన్స్‌ఫార్మర్ తొలగిన తీగలు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని జక్కదొన గ్రామంలోని చెరువు దగ్గర జాతీయ రహదారి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్సార్మర్లకు పచ్చని తీగలు అల్లుకున్నాయి. ఈ విషయంగా 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికన ప్రజాశక్తిలో బుధవారం వార్త ప్రచురితమైంది. స్పందించిన కార్వేటినగరం డీఈఈ చంద్రబాబు తమ సిబ్బందిని పురమాయించి తీగలు కత్తరించారు. ఇలాంటి సమస్యలు ఏకడైన ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. స్థానికులు ప్రజాశక్తికి అభినందనలు తెలిపారు.

రామకుప్పం ఎస్ఐగా వెంకట మోహన్



ప్రజాశక్తి-రామకుప్పం: రామకుప్పం ఎస్ఐగా వెంకట మోహన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. టిడిపి అధికారం చేపట్టిన తరువాత పది రోజులపాటు ఎస్ఐగా శివకుమార్ విధులు నిర్వహించారు. పోలీసు ఉన్నతాధికారులు ఆయన్ను చిత్తూరు విఆర్‌కు బదిలీ చేశారు. అప్పటి నుంచి రాళ్లబుదగురు ఎస్ఐ నరేష్ ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. సుమారు నాలుగు నెలల అనంతరం పోలీసు ఉన్నతాధికారులు తిరుపతి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకట మోహన్‌ను రామకుప్పంకు బదిలీ చేశారు. మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రజలు సహకరించాలని నూతన ఎస్ఐ కోరారు.

10న స్క్రీనింగ్ టెస్ట్‌లు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఉచిత మెగా డీఎస్సీ శిక్షణను పొందుటకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ నెల 10వ తేదిన ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగు స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరు కావాలని కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మెగా డీఎస్సీ ద్వారా ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల నిమిత్తం ఉచిత బోధన, భోజన, వసతి సౌకర్యాలతో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చుటకు నిర్ణయించడం జరిగిందన్నారు. ఉచిత మెగా డీఎస్సీ శిక్షణను పొందుటకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా కేంద్రంలోని మురకంబట్టు వద్దగల సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల, ఎస్‌వి సెట్ ఇంజనీరింగ్ కళాశాల, పూతలపట్టు మండలం పి కొత్తకోట వద్దనున్న వేము ఇంజనీరింగ్ కళాశాల, గంగవరం మండలం మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో జరగనున్నదని స్క్రీనింగ్ టెస్టులు నిర్వహిస్తారని తెలిపారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



విరాళాన్ని అందజేస్తున్న రిటైర్డ్ హెచ్‌ఎం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: విజయవాడ వరద బాధితులకు రిటైర్డ్ హెడ్‌మాస్టర్ సాంబశివన్ రూ.10వేల విరాళాన్ని అందించారు. చిత్తూరు నగరం దుర్గా నగర్ కాలనీకి చెందిన ఆయన బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి విరాళాన్ని అందజేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- ఎంఆర్‌పీ ధరలకే మద్యం అమ్మకాలు జరపాలి
- బెల్టుషాపులు నిర్వహిస్తే కేసులు నమోదు
- సారా తయారీలు, అమ్మకాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవు
- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ తలమాల విజయశేఖర్



విలేకరులతో మాట్లాడుతున్న విజయశేఖర్

ప్రజాశక్తి-కార్వేటినగరం:

మద్యం అమ్మకాల్లో నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, నిబంధనల మేరకే మద్యం అమ్మకాలు జరపాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ తలమాల విజయశేఖర్ హెచ్చరించారు. బుధవారం కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ నూతన ఎక్సైజ్ పాలసీలో చిత్తూరు జిల్లాలో 104షాపులు, తిరుపతి జిల్లాలో 227షాపులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. ఈ మద్యం దుఖాణాలు ఈ నెల 7వ తేదీ వరకు ప్రొవిజినల్ లైసెన్స్ నడుపుతున్నారన్నారు. ప్రభుత్వం నిబంధనల మేరకు ఎంఆర్‌పీ ధరలకే ఇద్యం విక్రయించాలని, దుఖాణాల ఎదుట ధరల పట్టిక తప్పనిసరిగా ఉండేలా చూడాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా టోల్ నెంబరును త్వరలో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం యోచిస్తోందన్నారు. బెల్ట్ షాపులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నియంత్రణకు కృషి చేస్తామని, నిబంధనలు ఉల్లంఘించి బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అంతే కాకుండా బెల్ట్ షాపునకు మద్యం పంపిణీ చేసిన దుఖాణాల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. తమిళనాడు, కర్ణాటక మద్యం ఒక్క బాటిల్ కలిగి ఉన్న వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని పేర్కొన్నారు. అదే విధంగా మిలటరీ ఉద్యోగస్తులకు ప్రభుత్వం రాయితీపై అందించే మద్యాన్ని అమ్మినట్లు తెలిసిన వెంటనే విచారణ చేపట్టి రుజువైతే కేసులు నమోదు చేస్తామన్నారు. మిటలరీ ఉద్యోగస్తులు ప్రభుత్వ నిబంధనలకు కట్టుబడి ఉండాలని చెప్పారు. గుడులు, బడుల వద్ద మద్యం దుఖాలు ఏర్పాట్లు చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, బహిరంగ ప్రాంతా ల్లో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు కల్పించినట్లయితే రిమాండ్‌కు తరలించి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో సారా తయారీలు, అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే యువత ఎక్సైజ్ అధికారులకు సమాచార అందించాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ కమిష నర్ వెంట ఎక్సైజ్ సీఐ శిరీష దేవి, ఎస్‌ఐలు శ్రావణ్ తేజ్, మోసస్, సిబ్బంది పలువురు ఉన్నారు.

ఇంటర్న్ షిప్‌పై అవగాహన



ప్రజాశక్తి-విజయపురం(నగరి):

నూతన విద్యావిధానంలో అంతర్భామైన ఇంటర్న్ షిప్ ద్వారా కళాశాలలో నాలుగు గోడల మధ్య విద్యనభ్యసించే విద్యార్థికి, పరిశ్రమలతో ప్రత్యక్ష అనుభవం ఏర్పడుతుందని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. కళాశాలలో కెరీర్ గైడెన్స్ విభాగం, ఐక్యూఏసీ, సత్వా ఇన్ఫోటెక్ కంపెనీ సంయుక్తంగా నిర్వహించిన "ఇంటర్నిప్ పై అవగాహన" కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంటర్నిప్ ద్వారా విద్యార్థులు పరిశ్రమలలో పని ప్రక్రియలను పరిశీలించడం ద్వారా పని సంస్కృతిని అలవర్చుకుంటారని తెలిపారు. విద్యార్థులు ఇంటర్నిప్‌ను శ్రద్ధాసక్తులతో చేయడం ద్వారా వివిధ మెళుకువలను తెలుసుకోవడమే కాకుండా, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, విశ్లేషణా నైపుణ్యాలు, యాజమాన్య నిర్వహణ వంటి అనేక నైపుణ్యాలను పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రేవతి, సత్వా ఇన్ఫోటెక్ హేమంత్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర రాజు, కోఆర్డినేటర్ డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, జెకెసి కోఆర్డినేటర్ డాక్టర్ పంకజ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాస్‌ను విజయవంతం చేయండి



గుడిపాల మండలంలో

ప్రజాశక్తి-గుడిపాల:

సెర్ప్ ఆధ్వర్యంలో జరిగే ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వయోజన విద్యాశాఖ సూపర్వైజర్ కందేశ్వరరావు అన్నారు. బుధవారం వెలుగు కార్యాలయంలో సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామస్థాయి వలంటీర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు సాయంత్రం రెండు గంటల సమయం పాటు బోధనా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. గ్రామాలలోని ఆయాలు, పాఠశాల కుక్‌లు, నైట్ వాచ్మెన్లు, గ్రూప్ సభ్యులను అందరిని ఆర్థికపరంగా, డిజిటల్ పరంగా, అక్షరాస్యత చేయాల్సిందే ఈ ఉల్లాస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. మండలంలోని 194మంది నిరక్షరాశ్యులను వంద శాతం అక్షరాస్యతగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపిఎం సుధారాణి, సిసి లోకనాథరెడ్డి పాల్గొన్నారు.

సోమల: మండలంలో అడల్ట్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉల్లాస్ అమలు కోసం గురువారం మండలంలో ఎంపిక చేసిన 34మంది వలంటీర్లకు ఉదయం 11గంటలకు వెలుగు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఏపీఎం శివ తెలిపారు. మండలంలో ఉల్లాస్‌ను విజయవంతం చేయడానికి సహకరించాలని కోరారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోండి

- ఏపీవో చంద్రశేఖర్

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం:

జిల్లాలో 16 కరువు మండలాలుగా ప్రకటించడంతో అందులో ఎస్ఆర్ పురం మండలం కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించడం జరిగిందని ఎపిఓ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం మండలంలో 23పంచాయతీలకు గ్రామ సభను నిర్వహించారు. గ్రామ పంచాయితీ కార్యదర్శులు గ్రామసభలో ప్రత్యేక అధికారి గుర్తించిన పనులను ప్రత్యేక అధికారులు ఖరీఫ్ 2024-25 వేతనాలను కోరుకునే వారికి ఫారం పాండు, అమృత్ సరోవర్, స్టాగర్ ట్రెంచ్లు, ఇంటర్నల్ ట్రెంచ్లు, రింగ్ ట్రెంచ్లు, రైన్ హార్విస్టింగ్ స్ట్రక్చర్స్ పనులను భూగర్భ జలాల రీఛార్జ్ చేసే నిర్మాణాలు,

పశువుల మేత పనులు, ప్లాంటేషన్ హార్టికల్చర్ పనులను మండలంలోని ఉపాధి హామీ కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

కార్యక్రమంలో సిద్దయ్య శెట్టి దామనాయుడు, భాస్కర్ నాయుడు డివి డిల్లెయ్య సూరి రెడ్డి, యెగేశ్వర్ నాయుడు, గురునాథం, దాసరి శతిష్, మాజీ సర్పంచ్ మోహన్ నాయుడు నిరంజన్ హేమాద్రి యాదవ్, టిఏలు రామ్మూర్తి, రేఖ తదితరులు పాల్గొన్నారు.

యాదమరి:

మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. ఓటేరిపల్లి గ్రామ సచివాలయంలో పత్తిపాటి భగవతీ రాజేంద్రనాయుడు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. మండల పరిధిలోని 26 గ్రామపంచాయతీలో ఏపీవో బాల, ఈసీ రమ్య, టెక్నికల్ అసిస్టెంట్ దేవరాజులు, టెక్నికల్ అసిస్టెంట్ మధు, నాలుగు టీములుగా పంచాయతీ సచివాలయాల్లో ఉపాధి గ్రామ సభ్యులు నిర్వహించారు. కరువు మండలం కావడంతో ఉపాధి హామీ పథకం కింద రైతులకు ఉపయోగపడే 36 పనులు ప్రభుత్వం అందుబాటు లో తీసుకొచ్చిందన్నారు.

ప్రతి రైతు ఉపాధి కూలీలు వారికి కావలసిన పనులు దరఖాస్తు చేసుకోవచ్చని ఏపీఓ బాల తెలిపారు. ఉపాధి గ్రామ సభకు ఓటేరిపల్లి సర్పంచ్ పత్తిపాటి భగవతి రాజేంద్రనాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ మధు, ఫీల్డ్ అసిస్టెంట్ కిషోర్, పంచాయతీ కార్యదర్శి,ఉపాధి కూలీలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సోమల: మండలంలోని 15 పంచాయతీల్లో బుధవారం ఉపాధి హామీ పథకం ద్వారా మరింత ఎక్కువ పనులు గుర్తించుటకు, చేసుకోనుటకు ప్రత్యేక గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో దినకర్ బాబు మాట్లాడుతూ మండలంలో కరువు పరిస్థితులు అధికంగా ఉన్న కారణంగా

ప్రభుత్వం సోమల మండలాన్ని కరువు మండలాల జాబితాలో చేర్చింది. రైతులు, కూలీలు ఉపాధి హామీ ద్వారా నూతన పనులను చేపట్టడం కచ్చితంగా ఉపాధి హామీ పథకంలో కూలీలు దినసరి వేతన దారులుగా పాల్గొని ఆర్థికంగా లబ్ధి పొందాలని కోరారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారు ఉపాధి హామీ జాబ్ కార్డు లో నమోదు చేసుకోవాలని కోరారు.

భర్త అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు



ప్రజాశక్తి-రామకుప్పం:

మండల పరిధిలోని ఉన్సిగానిపల్లి పంచాయతీ, అనిగానూరు గ్రామంలో భర్త అదృశ్యంపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు అమృత ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. గత నెల అక్టోబర్ 16న అనిగానూరు గ్రామానికి చెందిన ముని నారాయణ రెడ్డి కుమారుడు మంజునాథ్ రెడ్డిని కులాంతర వివాహం చేసుకున్నామన్నారు. అప్పటి నుంచి తనను వారి తల్లిదండ్రులు, బంధువులు ఫోన్ ద్వారా దుర్భాషలాడుతూ.. మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈనెల 5న మంగళవారం రాత్రి నుండి తన భర్త కనిపించడం లేదని, చుట్టుపక్కల బంధువుల ఇంట్లో వెతికిన కూడా ఆచూకీ లభించలేదనీ.. తన భర్త అదృశ్యం కావడానికి అత్త జ్యోతమ్మ, మామ మునినారాయణరెడ్డి, బంధువులు రవి శేఖర్ రెడ్డి, కిషోర్ కుమార్ రెడ్డిలపై అమృత అనుమానం వ్యక్తం చేసింది. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.